క్లుప్తంగా

సకాలంలో పంట రుణాలు ఇవ్వండి



అమరచింత: వానాకాలంలో పంటలను సాగుచేస్తున్న రైతులకు బ్యాంకు అధికారులు సకాలంలో రుణాలను అందించి, సహకరించాలని ఏఐకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఎదుట గురువారం రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బ్యాంక్ మేనేజర్‌కు అందించారు. అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని, అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.రెండు లక్షల రుణమాఫీని వెంటనే అమలుపర్చాలని కోరారు. మండల కేంద్రంలో ఒకే బ్యాంకు ఉన్నందున రైతులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మండలంలో కొత్తగా ఎస్‌బీఐ బ్రాంచ్ ఏర్పాటు చేసి ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజు, మోహన్, నాగరాజు, శివ, విష్ణు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన వీవర్స్‌సెల్ నాయకులు



వనపర్తి: రాష్ట్రంలో త్వరలో నియమించబోయే హ్యాండ్లూమ్ వీవర్స్ కార్పొరేషన్ (టీఎస్‌సీఓ) చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షిని కలిసి విన్నవించినట్లు టీపీసీసీ వీవర్స్ సెల్ ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాస్ నేత ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో వారిని కలిసి విన్నవించినట్లు పేర్కొన్నారు. 30ఏళ్లుగా పార్టీ కోసం పనిచేశానని, పార్టీ పరంగా పోరాటాలు చేయగా ప్రత్యర్థులు ఎన్నో కేసులు సైతం బనాయించారని, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశామని తెలిపారు. పార్టీ పటిష్టతకు కృషి చేసిన వారిని పరిగణలోకి తీసుకోవాలని కోరగా.. వారు సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

జీహెచ్‌ఎంగా విష్ణువర్ధన్‌రెడ్డి




పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎంగా విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. విష్ణువర్ధన్‌రెడ్డి పాన్‌గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయోసైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదోన్నతి పొందుతూ శ్రీరంగాపురం బాలుర పాఠశాలకు బదిలీపై వచ్చారు. ఇన్‌చార్జి హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న నాగేంద్రంగౌడ్ కొత్త జీహెచ్‌ఎంకు బాధ్యతలు అప్పగించారు.

విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

ఆత్మకూర్: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టి విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఎంఈఓ భాస్కర్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని, ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, టై, బెల్టు, షూస్, యూనిఫాం విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, రమేష్, ప్రణయ్, రవి తదితరులు ఉన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



అమరచింత: పురిటి నొప్పులతో బాధపడుతున్న నిండు గర్భిణిని అంబులెన్స్‌లో ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో అంబులెన్స్‌లోనే ప్రసవించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. అమరచింత మండలంలోని దీప్లానాయక్‌తండాకు చెందిన నందు పురిటి నొప్పులు అధికం కావడంతో ప్రసవం కోసం అంబులెన్స్‌లో ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు. మార్గమధ్యలో ఖానాపురం స్టేజీ సమీపంలో నొప్పులు అధికం కావడంతో ఈఎంటీ యశోద అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. అనంతరం వైద్య సేవల కోసం తల్లి, బిడ్డను ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు పైలట్ యుగంధర్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగు



అప్పరాలలో విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు అందజేస్తున్న జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్

కొత్తకోట రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య లభిస్తుందని జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. మండలంలోని అప్పరాల హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఎంపీపీ గుంత మౌనిక, హెచ్‌ఎం రాఘవేంద్ర, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం గోపాల్‌తో కలిసి ఆయన యూనిఫాం, పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా విద్యాబోధన, వసతులు ఉన్నాయని పేర్కొన్నారు. ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్నం భోజనం సౌకర్యం ఉంటుందని తల్లిదండ్రులు గమనించి తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు చిట్టెమ్మ, లక్ష్మి, వసంత, రాజశేఖర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్, గ్రామ పెద్దలు శంకర్‌నాయుడు, వెంకటేశ్వర్‌రెడ్డి, వీరేష్, నాగవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.

కొత్తకోటలో..

పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెచ్‌ఎం నిర్మలాదేవి యూనిఫాం, రాత, నోట్ పుస్తకాలు అందజేశారు. అనుభవం ఉన్న ఉపాధ్యాయులచే విద్యాబోధన అందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని, కౌన్సిలర్ నారాయణమ్మ, ఉపాధ్యాయ బృందం కవిత, మునింద్రమ్మ, శోభారాణి, రఘురామయ్య తదితరులు ఉన్నారు.

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నె ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ అన్ని వసతులు సమకూరుస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని సింగిల్‌విండో మాజీ చైర్మన్ బాల్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు బాలగౌడ్, జయలక్ష్మి, నాగశేషి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు రాములమ్మ, గ్రామస్తులు సింగయ్యశెట్టి, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

బడిబయటి పిల్లలపై దృష్టి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాల ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. నాగరాల 2, 3 సెంటర్లలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సౌకర్యాలను వారికి వివరించారు. విద్యార్థులకు అవసరమైన విద్య, పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటస్వామి, ఉపాధ్యాయులు శివనారాయణ, శంకర్, రాజేష్, కురుమూర్తి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాగరాలలో..



గోపల్‌దిన్నెలో..



కొత్తకోట బాలికల ఉన్నత పాఠశాలలో..

అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తాం..



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి

- గత ప్రభుత్వంలో మాటలే తప్ప చేతలు లేవు
- ఉమ్మడి జిల్లాకు సాగునీటి పుణ్యం వైఎస్‌దే
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి

గోపాల్‌పేట: రాబోయే రోజుల్లో అభివృద్ధి అంటే ఏంటో కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంధ్య అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం మాటలు తప్ప చేసిందేమీ లేదన్నారు. ఎక్కడా నిజమైన అభివృద్ధి జరగలేదని అన్నారు. చేపపిల్లలు, గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. తాగునీటికి సైతం ఇబ్బందిపడే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సాగునీళ్లు పుష్కలంగా అందుతున్నాయంటే, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పుణ్యమేనని అన్నారు. రైతుల కోసం వైఎస్సార్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో గ్రామస్థాయి నుంచి అభివృద్ధి చేసేందుకు సూక్ష్మ ప్రణాళికలు రచిస్తున్నామని చెప్పారు. త్వరలోనే 11వేల టీచర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయబోతుందని తెలిపారు. విద్యార్థుల కోసం ఉదయం టిఫిన్, సాయంత్రం స్నాక్స్ పంపిణీని ప్రారంభించినట్లు చెప్పారు. కాగా, బీఆర్‌ఎస్ నేత హరీష్‌రావు 25 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారని.. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారని ప్రశ్నించారు. వేసవిలో పూర్తి చేయాల్సిన పనులపై నీటిపారుదల శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. అధికారులు నిద్రమత్తు వీడాలని అన్నారు. ఉద్యానశాఖ ద్వారా అందించే రాయితీలపై రైతులకు అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అంతకుముందు ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో వనపర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందు వరుసలో నిలుపుతామన్నారు. అందరి సహకారంతో ప్రజలకు మేలైన పాలన అందిస్తామని చెప్పారు. అనంతరం ఎంపీటీసీలను సన్మానించారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ భార్గవి, పీఏసీఎస్ చైర్మన్ రఘు, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ ఉన్నారు.

జీపీ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలి



బండపల్లిలో జీపీ రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కోటేశ్వర్

పాన్‌గల్: జీపీ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ కోటేశ్వర్ అన్నారు. గురువారం మండలంలోని బండపల్లి, జమ్మాపూర్ గ్రామాలను సందర్శించి జీపీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా జీపీల్లో నిర్వహించే పనులు, పన్నుల వసూల వివరాలు, అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలకు సంబంధించిన రికార్డులను పక్కగా నిర్వహించాలని ఆదేశించారు. దీంతోపాటు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి మురుగు కాల్వల శుభ్రం, కాలనీల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం, తాగునీటి పైపులైన్ల లీకేజీలు వంటివి లేకుండా చూసుకోవాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల సంభవించే అవకాశాలు ఉంటాయని, వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. జీపీలకు నిర్దేశించిన లక్ష్యం మేరకు హరితహారం మొక్కలను సిద్ధం చేసుకోవడం, వాటికి అనుగుణంగా గుంతల తవ్వకాలపై దృష్టి సారించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు నాగమణి, హుస్సేనయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్ ధాన్యం గోల్‌మాల్‌లో ఒకరికి రిమాండ్

పాన్‌గల్: సివిల్ సప్లయ్ కార్పొరేషన్, ప్రభుత్వానికి సీఎంఆర్ ధాన్యం అప్పగింతలో మోసం చేసిన ఘటనపై గురువారం ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వనపర్తి టౌన్ ఎస్‌ఐ జయన్న తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండలం మాందాపూర్‌కు చెందిన పుచ్చల పరమేశ్వర్‌రెడ్డి సహకారంతో పెబ్బేర్ మండలం జనుంపల్లికి చెందిన రాచాల మహేశ్వర్‌రెడ్డి, అతడి భాగస్వాములు మధుకుమార్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, సాయిరెడ్డి సివిల్ సప్లయ్ కార్పొరేషన్ వారితో సీఎంఆర్ ధాన్యం గురించి ఒప్పందం చేసుకున్నారు. కానీ బియ్యాన్ని తిరిగి ఇవ్వకుండా సివిల్ సప్లయ్ కార్పొరేషన్, ప్రభుత్వాన్ని మోసం చేసి బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.75 లక్షలకు అమ్ముకొన్నట్లు తేలిందన్నారు. ఈ కేసులో పెబ్బేర్ మండలం జనుంపల్లికి చెందిన రాచాల మహేశ్వర్‌రెడ్డిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మిగతా వారు పుచ్చల పరమేశ్వర్‌రెడ్డి, మధుకుమార్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, సాయిరెడ్డి పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యా వ్యవస్థను పటిష్టం చేద్దాం



వనపర్తి: ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్టం చేయటంతో పాటు పేద విద్యార్థులకు చేయుతనిద్దామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు, జీసీడీఓ, హెచ్‌ఎంలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్థిక స్థోమత లేని పేద విద్యార్థులకు అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేగా తనపై, విద్యాశాఖ అధికారులపై ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలు, నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కావాల్సిన నిధులు, ప్రత్యామ్నాయ పనుల కోసం నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు. కేజీబీవీ, గురుకులంలో చదువుకునేందుకు పేద విద్యార్థులు చాలా మంది ముందుకు వస్తున్నారని, పాఠశాలల్లో సీట్లు మిగలకుండా అందరికీ చదువుకునే అవకాశం కల్పించాలని, అందుకు ప్రభుత్వం నుంచి కావాల్సిన అనుమతుల విషయంపై తాను ప్రయత్నం చేస్తానన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్‌పై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలని కోరారు. పాఠశాలల వారీగా కావాల్సిన సౌకర్యాల వివరాలను ఎమ్మెల్యే స్వయంగా రాసుకున్నారు.

నల్లా వివరాల సేకరణ



మామిడిమాడలో సర్వే చేస్తున్న ఎంపీడీఓ వెంకటాచారి తదితరులు

ఖిల్లాఘనపురం: గ్రామాల్లో చేపడుతున్న మిషన్ భగీరథ సర్వేలో పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటాచారి తెలిపారు. గురువారం మండలంలోని మామిడిమాడ, అప్పారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన మిషన్ భగీరథ సర్వేను ఆయన పరిశీలించారు. కార్యదర్శులతో కలిసి ఇంటింటికీ తిరిగి ఇంటి యజమానులతో మాట్లాడి తాగునీటి సరఫరాలో ఏర్పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరాలో అంతరాయం ఉన్నట్లయితే వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని అవసరమైన పరికరాలను అమర్చే అవకాశం ఉందని ఎంపీడీఓ చెప్పారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి

పాన్‌గల్: ఈనెల 20వ తేదీన నిర్వహించే నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీని కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్ రెడ్డి అన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమంపై పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాలల హెచ్‌ఎంలకు గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మాత్రలను ఏడాది నుంచి 19ఏళ్లలోపు విద్యార్థులకు పంపిణీ చేయాలని, ఈనెల 20వ తేదీన పాఠశాలలకు వచ్చే విద్యార్థులు తప్పనిసరిగా ఉదయం వేళ టిఫిన్ చేసి రావాలని, ఖాళీ కడుపుతో రావొద్దనే విషయాన్ని తల్లిదండ్రులకు వివరించాలన్నారు. టాయిలెట్‌కి వెళ్లి వచ్చిన తర్వాత, ఆహారానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు సంతోషమ్మ, సుమనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



ఆత్మకూర్: ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని పిన్నంచర్లలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా దోమ తెర వాడాలని సూచించారు.

దయాకర్‌రెడ్డి సేవలు మరువలేనివి



దయాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీతమ్మ

అమరచింత: నియోజక వర్గ అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి సేవలు మరవలేనివి అని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి అన్నారు. దయాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దయాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీతాదయాకర్ మక్తల్ నియోజకవర్గ అభివృద్ధితో పాటు అమరచింత మండలంలో రైతు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అమరచింత ఎత్తిపోతల పథకం స్థాపించిన దయాకర్ సేవలు నేటికీ పదిలంగా ఉన్నాయని కొనియాడారు. సేవే పరమావధిగా ముందుకు సాగిన దయాకర్‌రెడ్డి ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తిరుమలేష్, మనోహర్ రాజు, దాసు, రవీందర్‌రెడ్డి, జిలాని తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మక్తల్ మాజీ ఎమ్మెల్యే దివంగత కొత్తకోట దయాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతిని కాంగ్రెస్ నాయకలు ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద దయాకర్‌రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి దయాకర్‌రెడ్డి సతీమణి మాజీ ఎమ్మెల్యే సీతమ్మ, కుమారుడు కార్తీక్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గానికి చేసిన సేవలను గుర్తించుకుని సంతాపం ప్రకటించారు. అనంతరం స్థానిక సాయిబాబ మందిరం వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో రామలక్ష్మారెడ్డి, బాలకృష్ణారెడ్డి, ఎస్టీడీ శ్రీను, గాలి పంపు శ్రీను, రహ్మతుల్లా, తులసీరాజ్, పరమేష్, నల్గొండ శ్రీను, రాములు, వెంకటేష్, వెంకటన్న, తిరుపతయ్య, కుమార్, నర్సింహ ఉన్నారు.

వాల్మీకి సంఘం మండల కమిటీ ఎన్నిక

చిన్నంబావి: వాల్మీకి హక్కుల కోసం తన వంతు పోరాటం చేస్తానని వాల్మీకుల మండల నూతన అధ్యక్షుడు గుజ్జుల బాలకృష్ణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన వాల్మీకులు గురువారం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా దగడపల్లికి చెందిన గుజ్జుల బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా మద్దిలేటి జింకల రమేష్, ఉపాధ్యక్షుడిగా చిన్నలింగస్వామి, కోశాధికారి గంగారి శ్రీను, సభ్యులు 15మందితో కలిపి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ మండలంలోని వాల్మీకులకు అనునిత్యం అండగా ఉంటానని, సంఘం బలోపేతం కోసం అహర్నిషలు కృషి చేస్తానని తెలపారు. కార్యక్రమంలో తిరుపాల్, రాజ్‌కుమార్, రామకృష్ణ, నాగేంద్రం, సుధాకర్ నాయుడు, సత్యం, ఉమేష్‌నాయుడు, కురుమయ్య పాల్గొన్నారు.

తీరిన తాగునీటి సమస్య



ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ ప్రజల దాహార్తి తీరనుంది. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని గ్రామస్తులు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఆయన స్పందించి బోరు వేసేందుకు ఏర్పాటు చేశారని గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్వర్‌రావు తెలిపారు. గురువారం గ్రామంలో బోరు వేయగా 3 ఇంచుల నీళ్లు వచ్చాయని చెప్పారు. త్వరలోనే బోరుమోటార్ బిగించి ప్రజలకు తాగునీటిని అందిస్తామని పేర్కొన్నారు. బోరు బండిని పంపిన ఎమ్మెల్యే మేఘారెడ్డికి ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రావుతో పాటుగా మాజీ సర్పంచు, మాజీ వార్డు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించాలి

పాన్‌గల్: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని కోరుతూ మండల వాసి, ఓబీసీ జాతీయ కోఆర్డినేటర్ డా.కేతూరి వెంకటేష్ గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని ఎన్‌ఎస్‌యూఐ విద్యార్థి దశ నుంచి ఉస్మానియా క్యాంపస్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేశానన్నారు. 'భారత్ జోడో'యాత్రలో భాగంగా కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు 150 రోజులు 4,080 కిలోమీటర్లు రాహుల్‌గాంధీ వెంట నడిచినట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ బలోపేతంతో పాటు తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు ఆయన వివరించారు. తన సేవలను గుర్తించి కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పిస్తారని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం శాలువాతో సీఎంను ఘనంగా సన్మానించారు. వినతిపత్రంపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు కేతూరి పేర్కొన్నారు.

మున్సిపాలిటీ వార్డులకు అధికారుల కేటాయింపు

కొత్తకోట రూరల్: మున్సిపాలిటీ కేంద్రంలోని 15 వార్డులకు అధికారులను నియమించామని, ఆయా వార్డులు, కాలనీలో ఏ సమస్య వచ్చిన ప్రజలు నేరుగా సంబంధిత అధికారికి ఫోన్ చేసి సమస్యను వివరించి పరిష్కరించుకోవాలని కమిషనర్ ఎస్ఎన్ సూర్యకుమార్ తెలిపారు. 1వ వార్డుల్లోని శివాలయం వీధి, కోట్ల హనుమాన్ వీధి, 2వ వార్డుల్లోని భవనమ్మ టెంపుల్ వీధి, మంగయ్య టెంపుల్ వీధి, కోదండరామస్వామి ఆలయం వీధి అధికారిగా భాగ్యలక్ష్మి ఫోన్ నంబర్ 94915 23949, 3వ వార్డులోని రామాలయం, గొల్ల వీధి, పాత మున్సిపల్ కార్యాలయం ఏరియా, మదనాపురం రోడ్డు, ముష్టి వీధి, పెద్ద మజీద్, ఉర్దూ మీడియం స్కూల్ ఏరియాలకు మిద్దె లక్ష్మి 86398 09634, 4వ వార్డులోని వనపర్తి రోడ్డు, దండ్లుగడ్డ వీధి, ప్రభుత్వ హైస్కూల్, చెక్కమండి, కట్టెలమండి, జీటీ నారాయణ స్కూల్, కేపీఎస్ స్కూల్, బస్టాండ్, హైదరాబాద్ రోడ్డు ఏరియాలకు, 5వ వార్డులోని దండుగడ్డ ఏరియా, గొల్లవీధి, ఎక్స్ రోడ్డు, వనపర్తి రోడ్డు ఏరియాలకు అధికారిగా అంజమ్మ 86885 48964, 6వ వార్డులోని అంబేడ్కర్ కాలనీ, శివగార్డెన్, కర్నూల్ రోడ్డు, శ్రీరామ రైస్‌మిల్, ఆర్అండ్‌బీ పాత కార్యాలయం ఏరియాలకు, 7వ వార్డులోని రాఘవేంద్ర కాలనీ, ఎన్‌టీఆర్ కాలనీ, కొత్తూర్ రోడ్డు, శివగార్డెన్, అంబేడ్కర్ కాలనీలకు, 8వ వార్డులోని శిశుమందిర్, సాయిరాం ఫంక్షన్‌హాల్ ఏరియా, కర్నూల్ రోడ్డు, రాఘవేంద్ర కాలనీలకు అధికారిగా కె.నాగేశ్వర్ 77022 44510, 9వ వార్డులోని కర్నూల్ రోడ్డు, శివప్రియ హోటల్ వెనుక, యూనియన్ బ్యాంక్ వెనుక ప్రాంతం, శిశుమందిర్ స్కూల్ ఏరియా, 10వ వార్డులోని కొత్తూర్‌రోడ్డు, గ్రంథాలయం వీధి, మదనాపురం రోడ్డు, కుమ్మరి వీధి, ఎక్స్‌రోడ్డు, కర్నూల్ రోడ్డు కాలనీలకు అధికారిగా వి.శశికళ 99087 73309, 11వ వార్డులోని వడ్డెవాట రోడ్డు, బీసీ హాస్టల్ ఏరియా, ఎస్సీ కాలనీ, కొత్తూర్ రోడ్డు, 12వ వార్డులోని ఎఫ్‌సీఐ పాత గోదాం, బీసీ హాస్టల్ రోడ్డు, మదనాపురం రోడ్డు, కార్ఖాన నాగయ్యవీధి, మటన్ మార్కెట్, భారతీయ విద్యామందిర్ స్కూల్ ఏరియా, 13వ వార్డులోని మదనాపురం రోడ్డు, వడ్డెవాట రోడ్డు, ఎఫ్‌సీఐ పాత గోదాం రోడ్డు, వీవర్స్ కాలనీ (సాలెపేట)లకు అధికారిగా జయరాములు 85003 31811, 14వ వార్డులోని ఎస్సీ కాలనీ, చర్చి ఏరియా, మదనాపురం రోడ్డు, గణేష్‌నగర్ కాలనీ, 15వ వార్డులోని మదనాపురం రోడ్డు, రెడ్డిమార్క్ బీడీ కార్ఖాన, చర్చి, కోట్ల వెంకన్నబావి ఏరియాలకు అధికారిగా వినోద 95028 49109 లు అందుబాటులో ఉంటారని కమిషనర్ పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

అమరచింత: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో మున్సిపాలిటీ పాలకవర్గం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు ఆరోపించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఐ మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, మహిళల మరుగుదొడ్లు, వీధిలైట్లు, ఇళ్లపై ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ల తొలగింపు పనులు వెంటనే పరిష్కరించాలన్నారు. 4 ,5, 6, 7 వార్డుల్లో మహిళలకు సామూహిక మరుగుదొడ్లను నిర్మించాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి పాల్ మెమోరియల్ స్కూల్ వరకు ఉన్న చెరువు కాల్వను తొలగించి వాటి స్థానంలో అండర్ డ్రెయినేజీ నిర్మించి కాలనీవాసుల సమస్యను పరిష్కరించట్లేదని విమర్శించారు. కొత్త బస్టాండ్ నుంచి మస్తీపురం క్రాస్ రోడ్ వరకు ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపాలిటీ పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయినా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని ఎద్దేవా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీంకు అందించారు. కార్యక్రమంలో అబ్రహం, భాస్కర్, శ్యాంసుందర్, రవీందర్, కుతుబ్, రఘు, మల్లేష్, ఇబ్రాయిల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

పెంట్లవెల్లి: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ ఉమామహేశ్వరి అన్నారు. గురువారం మండల కేంద్రలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఆయా గ్రామాల ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను కోరారు. విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హిమబిందు, వైస్ ఎంపీపీ బీంరెడ్డి, ఎంపీడీఓ ప్రసన్నకుమార్, సింగిల్‌విండో చైర్మన్ విజయరామారావు పాల్గొన్నారు.